క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం రేపు

గరుగుబిల్లి: కురుపాం మండలం చినమేరంగిలో సోమవారం ఉదయం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్, ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు శనివారం తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరుకావాలని కోరారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న డాక్టర్ రవీంద్రకుమార్

వీరఘట్టం: యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పాలకొండ ఏరియా ఆస్పత్రి చిన్నపిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని పనసనందివాడ గ్రామంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన 35 మంది యువత రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొరికాన సన్యాసినాయుడు, కుసిమి, అన్నవరం, బిటివాడ ఆస్పత్రుల వైద్యాధికారులతో పాటు పాలకొండ ఏరియా ఆస్పత్రి సిబ్బంది సేవలందించారు.

సస్యరక్షణపై అవగాహన



దోలమడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఓ

పాలకొండ రూరల్: జీడి, మామిడి తోటల్లో సస్యరక్షణపై రైతులు అవగాహ పెంచుకోవాలని ఉద్యానవన శాఖాధికారి తమ్మినేని అమరేశ్వరి అన్నారు. మండలంలోని డోలమడ, బర్న, ఎం.సింగుపురం సమీపంలో మామిడి తోటలు సాగుచేస్తున్న రైతులకు సర్యరక్షణ చర్యలపై శనివారం అవగాహన కల్పించారు. పూత రాలిపోకుండా చేపట్టాల్సిన చర్యలను వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. గ్రామస్థాయిలో ఉన్న రైతుభరోసా కేంద్రాల ద్వారా శాఖా పరంగా అందిస్తున్న సేవలు అందిపుచ్చుకోవాలన్నారు.

ఏరియా ఆస్పత్రిలో డెర్మటాలజిస్ట్ నియామకం

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో వైద్యుల నియామకానికి చర్యలు తీసుకుంది. ఆస్పత్రిలో కొత్తగా డెర్మటాలజిస్ట్(చర్మవ్యాధి నిపుణులు) డాక్టర్ మిథాలిని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న స్పెషలిస్టు వైద్యుల సంఖ్య 21కి చేరింది. జనరల్ మెడిసిన్‌తో పాటు ఇద్దరు గైనకాలజిస్టులు, చిన్నపిల్లల వైద్యులు ఉన్నారు. అలాగే డెంటిస్టు, నేత్రవైద్యులు, ఈఎన్‌టీ డాక్టర్, ఆర్థో, జనరల్ సర్జన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ తో పాటు సాధారణ వైద్యులు ఉన్నారు. పూర్తిస్థాయిలో మందులు, వైద్యులు అందుబాటులో ఉన్నారని సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఏరియా ఆస్పత్రి సూపరెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



విరిగిన విద్యుత్ స్తంభం

సీతంపేట: స్థానిక ఐటీడీఏ వద్ద శనివారం వేకువజామున పాలకొండ నుంచి కొత్తూరు వైపు వెళ్తున్న భారీ లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో డివైడర్‌పై ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపడింది. అయితే ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

పాలకొండ రూరల్: మండలంలోని గొట్ట మంగళాపురం వద్ద అదే గ్రామానికి చెందిన బి.వరహాలనాయుడు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై హేమంత్‌కుమార్ తెలిపారు.

గీత కార్మికులకు ఐడీ కార్డులు

బలిజిపేట: గీత కార్మికులకు మంజూరైన ఐడీ కార్డులను జెడ్పీటీసీ రవికుమార్ శనివారం పంపిణీ చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ద్వారా మండలంలో 30మంది గీత కార్మికులకు ఐడీ కార్డులు మంజూరయ్యాయి. కల్లు గీత కార్మికులలో వృత్తి చేసే వారికి 50సంవత్సరాలు దాటిన వారికి వీటిని మంజూరు చేస్తారు. గలావల్లికి చెందిన తొమ్మిది మంది కార్మికులకు కార్డులను పంపిణీ చేశారు. కార్పొరేషన్ ద్వారా పథకాలు మంజూరైతే వీటి ద్వారా వారికి లబ్ధి చేకూరే అవకాశాలున్నాయని తెలిపారు. కొత్త పింఛను మంజూరుకు దీనిని వినియోగించుకోవచ్చని తెలిపారు.

పక్కాగా కులగణన

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనలో సమగ్ర సమాచారం నమోదు చేయాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మండలంలోని తంపటాపల్లి గ్రామంలో జరుగుతున్న సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సెక్షన్-1లో ఉన్న 14 అంశాలను సక్రమంగా తెలుసుకుని నమోదు చేయాలన్నారు. కుల గణన వలన ఎవరికీ ఎటువంటి నష్టం ఉండదని, సంక్షేమ పథకాలు ఆగిపోవని అన్నారు. కేవలం కులాల వారీగా జనాభా సంఖ్యను తెలుసుకునేందుకే గణన చేపడుతున్నట్లు చెప్పారు. సర్వే సిబ్బంది ప్రజల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు సమగ్ర సమాచారం సేకరించాలని సూచించారు.

- వీరఘట్టం: కులగణన ఓ చారిత్రాత్మక నిర్ణయమని వీరఘట్టం మేజరుపంచాయతీ ఈఓ రామచంద్రరావు అన్నారు. సచివాలయం-3 పరిధిలో నిర్వహిస్తు న్న కులగణనను శనివారం ఆయన పరిశీలించారు. అన్ని వర్గాల అభ్యున్నతికి బాటలు వేయాలనే మంచి లక్ష్యంతో రాష్ట ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కులగణన ప్రక్రియకు రాష్ట ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నా రు. కులగణనలో ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్తలు పాటించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.



పాలకొండ రూరల్: తంపటాపల్లిలో కుల గణన ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు



వీరఘట్టం: బార్నాలవీధిలో కులగణన చేస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు



భామిని: నేరడి-బిలో కులగణన సర్వే చేస్తున్న కార్యదర్శి అనసూయ

- భామిని: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం నుంచి కుల గణన ప్రక్రియ ప్రారంభమైంది. సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం కుటుంబ సభ్యుల బయోమెట్రిక్‌తో వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.
- గుమ్మలక్ష్మీపురం: లోటుపాట్లు లేకుండా కుల గణన సర్వేను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ ఎస్. సాల్మన్‌రాజు అన్నారు. మండలంలోని పి.ఆమిటి గ్రామ సచివాలయం పరిధిలో శనివారం నిర్వహించిన కుల గణన సర్వేను ఎంపీడీఓ పరిశీలించారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇంటింటి కీ వెళ్లి ఇంటి యజమానితో మాట్లాడి వివరాలు పూర్తిగా తెలుసుకొని, యాప్‌లో నమోదు చేయాలన్నారు.



గుమ్మలక్ష్మీపురం: పి.ఆమిటిలో కుల గణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. స్థానిక ఐటీడీఏలో సెక్టోరియల్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశభక్తి ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రదానం చేసే ప్రశంసా అవార్డుల ఎంపిక త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, జీసీసీ డీఎం సంధ్యారాణి, పీఏఓ హరికృష్ణ, పీహెచ్‌ఓ గణేష్, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకబ్ దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

తెలగ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలి



గుమ్మలక్ష్మీపురం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలగ కుల సంఘ నాయకులు



పాలకొండ: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న తెలగ కుల సంఘ నాయకులు

పాలకొండ: ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఆర్థికంగా వెనుబడి ఉన్న తెలగ కులస్తులను బీసీల్లో చేర్చాలని తెలగ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఉప తహసీల్దార్ బి.బుచ్చయ్యకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు సుంకరి అనీల్ దత్, వెన్నపు శ్రీనివాసరావు, వెంటరమణ మాట్లాడుతూ.. తెలగ కులంలో 80శాతానికి పైగా నిరుపేదలు ఉన్నారన్నారు. అధిక శాతం మంది వలస కూలీలుగా బతుకుతున్నారని, దుర్భర పరిస్థితుల్లో ఉన్న కుంటుంబాలు వేల సంఖ్యలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 1962 వరకు బీసీల్లో ఉన్న తెలగ కులాన్ని ఓసీ జాబితాలో చేర్చడమే వెనుకబాటుకు కారణమని పేర్కొన్నారు. ప్రభుత్వం తమపై దయతలసి తెలగ కులస్తులను ఆదుకోవాలని కోరారు.

గుమ్మలక్ష్మీపురం: తెలగ కులాన్ని బీసీలో చేర్చాలని గుమ్మలక్ష్మీపురం తెలగ సంఘం నాయకులు ఎర్నాకుల నాగరాజు, పైడా జగదీశ్వరరావు, ఆత్తిలి శ్రీనివాసరావు, మేడిద గోపాల్ తదితరులు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ జె.రాములమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలగ కులం సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎంతో వెనుకబడి ఉందని, బీసీలో చేర్చి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పాలకొండ రూరల్: నవోదయ ప్రవేశ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ బాలురు, బాలికోన్నత పాఠశాల కేంద్రాల్లో జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. రెండు కేంద్రాల్లో కలిపి 324 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 41 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ ఆర్.ఆనందరావు తెలిపారు. హెచ్‌ఎం కె.పి.నాగమణి, బి.సాంబర, వెన్నెలవలస నవోదయ ఉపాధ్యాయులు పి.వంశీధర్, ఆర్.సాయిలక్ష్మి పరీక్షలను పర్యవేక్షించారు.

కురుపాం: జవహర్ నవోదయ పాఠశాలలో ప్రవేశానికి గాను స్థానిక ఆదర్శ పాఠశాలలో శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు 240 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 198 మంది హాజరయ్యారు. 42 మంది గైర్హాజరైనట్లు సీఎల్‌ఓ కె.సురేంద్ర, సీఎస్ ఆరిక సుందరరావు తెలిపారు.

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షకు 312 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 255 మంది హాజరైనట్లు కేంద్రం పర్యవేక్షకులు మీసాల సూర్యనారాయణ తెలిపారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో జరిగిన పరీక్షకు 221 మంది విద్యార్థులు హాజరైనట్లు సదరు కేంద్రం సూపరింటెండెంట్ రేణుకాదేవి తెలిపారు. డిప్యూటీ ఈఓ పి.కృష్ణమూర్తి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.



వీరఘట్టం: బాలికోన్నత పాఠశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న వెన్నెలవలస జేఎన్‌వీ ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య, ఎంఈఓ ఆనందరావు

పచ్చిరొట్టతో పైరుకు పోషణ



ఏడీ కె.రత్నకుమారి

పాలకొండ రూరల్: సేంద్రియ ఎరువులతో పంటల సాగు అన్ని రకాలుగా శ్రేయస్కరమని వ్యవసాయశాఖ ఏడీ కె.రత్నకుమారి పేర్కొన్నారు. ప్రకృతి సాగు విధానంలో భాగంగా పచ్చిరొట్ట సాగుతో భూమికి కావాల్సిన పోషకాలు లభిస్తాయని, ఫలితంగా ఎరువుల వినియోగం, ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడులు పెరుగుతాయన్నారు.

నేలలో నత్రజని స్థాపనం

పచ్చరొట్టగా ఎకరాకు 12 కిలోల జనుమును విత్తితే 5 నుంచి 7 టన్నుల దిగుబడి వస్తుంది. అలాగే 40 కిలోల నత్రజని నేలకు అందుతుంది. ఎకరాకు 15 కిలోల జీలుగు విత్తితే ఐదు నుంచి ఏడు టన్నుల పచ్చిరొట్ట, 60 కిలోల నత్రజని పైరుకు అందుతుంది. ఎకరానికి 15 కిలోల అలసంద విత్తనాలు విత్తుకుంటే 3 టన్నుల పచ్చిరొట్ట, 35 కిలోల నత్రజని భూమికి లభిస్తుంది. 6 కిలోల పిల్లిపెసర ద్వారా 3 టన్నుల పచ్చిరొట్ట, 40 కిలోల నత్రజని లభిస్తుంది. ఎకరాకు 8 కిలోల పెసర విత్తనాలు విత్తుకుంటే మూడు టన్నుల పచ్చిరొట్ట, 25 కిలోల నత్రజని నేలలో నిలుస్తుంది. పెసరసాగు చేసి కాయకోత అనంతరం యాధాస్థితి పొలాన్ని దున్నుకుంటే ఆ వ్యర్థాలు బలవర్ధక ఎరువుగా మారుతాయని వివరించారు. పచ్చిరొట్టపైరు నేలసారాన్ని, భౌతిక లక్ష్యణాలను మెరుగుపరుస్తాయి. అలాగే తేమ నేలలో నిలిచే సామర్థ్యాన్ని గననీయంగా పెంచుతాయి. నేల కోతకు గురికాకుండా, మేలు చేసే సూక్ష్మజీవులను వృద్ధి చేస్తాయి. ఈ రకమైన సేంద్రియతను ముందస్తు ప్రణాళికతో సిద్ధం చేసుకోవటం వలన దిగుబడి పెంచుకోవచ్చు.

తేమ ఉన్నప్పుడే కలియ దున్నాలి..

పచ్చిరొట్ట పైరును పూతదశలో నేలలో కలియ దున్నడం, నేలలో సరైన తేమ ఉన్న సమయంలో మాత్రమే ఈ తరహా విధానం చేపట్టడం శ్రేయస్కరం. నేలలో తేమ ఉన్నప్పుడు పచ్చిరొట్ట పైరుతో సహా కలిపి దున్నితే త్వరగా కుళ్లి భూ సామర్థ్యాన్ని పెంచుతుంది. పవర్ టిల్లర్ లేదా రోటావేటార్ సాయంతో నేలలో పచ్చిరొట్ట కలిసే విధంగా దున్నడం ఓ పద్ధతి. అలా దున్నిన అనంతరం 15 రోజుల వ్యవధిలో పైరు భూమిలో కుళ్లుతున్న సమయంలో ఎకరాకు 50 కిలోల సూపర్‌పాస్ఫేట్ ఎరువును చల్లడం ద్వారా మరింత లాభం పొందవచ్చు.



పచ్చిరొట్ట సాగు

పీహెచ్‌సీల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

సీతానగరం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం పీహెచ్‌సీల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచిందని వీటిని వినియోగించడం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా మలేరియా నివారణాధికారి(డీఎంఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండల కేంద్రంలో జరిగిన ఫ్యామిలీ కాన్సెప్ట్ విధానంతో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రులకు వివిధ రకాల కారణాలతో అనారోగ్యానికి గురైన వారు రోగ నివారణకు వచ్చిన వారికి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన తరువాత మందులు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వినియోగించేలా చూడాలన్నారు. పీహెచ్‌సీలో అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. డాక్టర్ పావని, సీహెచ్‌ఓ ఎస్‌పీ రమణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తే మరింత ఆహ్లాదం



వెంకమ్మ చెరువు

వీరఘట్టం: మండల కేంద్రానికి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో పాలకొండ రోడ్డులో మరియగిరి పుణ్యక్షేత్రాన్ని ఆనుకుని ఉన్న వెంకమ్మ చెరువు చుట్టూ ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. వీరఘట్టం వాసులంతా ప్రతిరోజు ఉదయం, సాయంత్ర సమయాల్లో ఇక్కడ వాకింగ్ చేయడంతో పాటు సేదతీరుతుంటారు. ఈ చెరువును సుందరీకరిస్తే ఈ ప్రాంతం పర్యటకంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. సుమారు రెండు వందల ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువు కింద 500 ఎకరాల ఆయకట్టు ఉంది. సాగునీరు పుష్కలంగా అందడంతో ఏటా రెండు పంటలు పండుతున్నాయి. చెరువులో సుమారు 80 ఎకరాల వరకు ఆక్రమణలకు గురైంది. అధికారులు స్పందించి చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలు తొలగించి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి...

- 40 కుటుంబాల చేరిక
- సంక్షేమం, అభివృద్ధి చూసి..
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ సభ్యులు

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీని వీడి ఆ పార్టీ శ్రేణులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం పట్టణంలోని ఏడో వార్డుకు చెందిన 40 కుటుంబాలు టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. వీరికి ఎమ్మెల్యే జోగారావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనను మెచ్చి పార్టీలోకి వచ్చే వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి పార్టీ శ్రేణులు విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. గత టీడీపీ హయాంలో జరిగిన నష్టం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరుగుతున్న సంక్షేమ లబ్ధి, అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా అంతా పని చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వార్డు కౌన్సిలర్ రణభేరి చిన్నంనాయుడు, నాయకులు బూరి కృష్ణ, సువ్వాడ శ్రీనివాసరావు, జి.చిరంజీవి, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



సీతంపేట: కబడ్డీలో విజేతలుగా నిలిచిన మండ సచివాలయ యువత



భామిని: ఆసక్తిగా సాగుతున్న కబడ్డీ పోటీ



భామిని: విజేతలను అభినందిస్తున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరి, క్రీడల కన్వీనర్ శివరామప్రసాద్

భామిని: 'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. ఏపీ మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఫైనల్స్ పోటీలు నిర్వహించారు. క్రికెట్‌లో భామిని, బాడ్మింటన్ పురుషుల విభాగంలో వడ్డంగి, మహిళల విభాగంలో ఘనసర సచివాలయ జట్లు విజేతలుగా నిలిచాయి. వాలీబాల్ పురుషుల విభాగంలో బాలేరు-2, మహిళల విభాగంలో పెద్దదిమిలి సచివాలయం జట్లు గెలుపొందాయి. కబడ్డీలో బాలేరు-1(పురుషులు), బొడ్డగూడ(మహిళలు), ఖోఖో ఘనసర(పురుషులు), కాత్రడగ-బి(మహిళలు) సచివాలయ జట్లు విజేతలుగా నిలిచాయి. వీరంతా ఈ నెల 24 నుంచి జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, క్రీడల కన్వీనర్ శివరామప్రసాద్ తెలిపారు. విజేతలను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.

కబడ్డీ విజేత మండ

సీతంపేట: 'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి క్రీడాపోటీల్లో కబడ్డీ విభాగంలో మండ గ్రామ సచివాలయం యువత విజేతగా నిలిచింది. విజేతలను ఎంపీడీఓ గీతాంజలి, స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్ దయానంద్, వ్యాయామోపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.